# పొల్లు

— వి. వి.

"సంగీత మపిసాహిత్యం మేకమా పాతమధురం అన్యదాలోచనామృతం" అన్నారు, పెద్దలు. సంగీతం యొక్క మాధుర్యం చెప్పలేనంతది అని గదా దీనికర్థం- నిజమే మరి. అయితే పాడేదంతా, మధురమేనా అని సందేహం, ఎందుకంటే కొందరు పాడుతుంటే మాధుర్యానికి బదులు చిరాకు కలుగుతుంది. పైగా కొందరి పాటలో తీపి పాలు తక్కువటి. కాఫీలలో వేసే చేదూ పాళ్లు వున్నట్టుగా ఈనాటి "లైట్ మ్యూజిక్" లో కూడా అవి వున్నట్టే అనిపించుతాయి. కాఫీ పదేపదే తాగినవాడికి ఆకలిపోయినట్టు, ఈ రకం సంగీతం అదేపనిగా వింటే మంచి శాస్త్రీయ సంగీతపై బుద్ధిపోదు. అటువంటప్పుడు ద్రాక్షాపాకంలాటి ఆ పాత మధుర సంగీతాన్ని కాంక్షించేదెవరూ అని.

ఈనాటి ప్రపంచంలో అసలవాటి కన్నా నకిలీవాటిమీదే ప్రజకు మోజు హెచ్చుగావుంది. నాటకకళ అడుగంటితే సినిమారంగం విజృంభించింది. భరత నాట్యమంటే అర్థంగానివారంతా "రోల్ అండ్ రాక్" చూసి హర్షిస్తున్నారు.

"లోకోభిన్నరుచి!" అంటారేమో అది సత్యంకాదనను కాని హెచ్చుపాళ్లు ఎవరు దేనిని హర్షిస్తే అదే అందపై కూర్చుంటుంది

పాడినదంతా సంగీతం కానట్టు రాసిందంతా సాహిత్యం కాదని అన్నారొకరి మధ్య. కలం చేతపట్టగలిగిన ప్రతీవారూ తాను రచయితనని అనుకునే పాడురోజులొచ్చాయండీ అని వాపోయారు. అవునుమరి ఏదో ఒకటి రెండు కథలు రాసిన అస్మదాదులంతా రచయితలైతే అనరా అని. చెట్టు మహావృక్షం కావడానికి ఎన్నోయేళ్లు పట్టినట్టు. ఎన్నో ఋతువులదాడికి తట్టుకున్నట్టు మహా రచయిత కావడానికి కూడా కొంతకాలం కావాలని అన్నారు వారు. అవును మహాగాయకుడు కావడానికి అంతే అన్నాను. వారు మాట్లాడలేదు

చూడండి నామీద ఆగ్రహించక పోతే ఒక్కమాట అన్నాను. నావైపు చూసి ఉరిమారాయన. నేను మాట్లాడలేదు. "ఊ కానియ్యండి" అన్నారు.

గడ్డిపోచలు మొలవడం గడ్డిపూలు పూయడానికి ఆట్టే కాలం పట్టదు. మఖలో పుట్టి పుబ్బలో రాలిపోతాయి అలాగే ఇదీ అంతే. వీటి ప్రయోజనం వీటికీ యీ మహాసృష్టిలో వుంది. గ్రాసజీవులైన పశువులకైనా వుపయోగపడుతున్నాయి గదా వాటి అందంచూసి ఒక్క క్షణమైనా మీబోటివారు చూసి నిలబడకపోరుగదా అన్నాను.

"ఊ కానియ్యి ఆగకు" అన్నారు.

"మహావృక్షాలు నీడనిస్తే తరతరాలుగా ఆనందాన్ని సౌఖ్యాన్ని ప్రసాదిస్తే, ఆ పాతమధుర సంగీతఝరిలో ఎందరో ఆసంఖ్యాకులు అఘమర్షణ స్నానమాచరిస్తే, ఊక పొల్లు యింకొందరికి కొన్ని ఘడియల్లో పని చేస్తాయి. సృష్టి వైచిత్ర్యమే అంత" అన్నా. *